సాక్షి విశాఖపట్నం

సోమవారం । 11 । నవంబర్ । 2024



ఘనంగా గురునానక్ జయంతి 8లో



కార్తీక సందడి 8లో



మట్కా అలరిస్తుంది
- ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో వరుణ్ తేజ్ 8లో

• శంఖు చక్ర నామాలు కనువిందు



సింహగిరిపైన వైకుంఠవాసుడి మెట్టపై వంద అడుగుల వెడల్పు, 36 అడుగుల ఎత్తులో శంఖు చక్ర నామాలు కనువిందు చేస్తున్నాయి. జీఆర్టీ జ్యూయలర్స్ రూ.1.50 కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసిన వీటిని దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు ఆదివారం ప్రారంభించారు. 8లో

• 'కంటిపాప'లను కాపాడుకుందాం



ఎల్.వి.ప్రసాద్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులో ఆదివారం అవగాహన నడక కార్యక్రమం జరిగింది. బాల్య శుక్లాల కారణంగా పిల్లల్లో కంటి చూపుపై ప్రభావం పడుతుందని, త్వరితగతిన గుర్తించి చికిత్స అందించాలని కంటి వైద్యులు పిలుపునిచ్చారు. - ఏయూ క్యాంపస్ 8లో

• సాగర తీరంలో ఆరోగ్య పరుగు



నమహ అకాడమీ, నేవీ సంయుక్తంగా బీచ్‌రోడ్డులో ఆదివారం నిర్వహించిన మారథాన్ ఉత్సాహంగా సాగింది. ప్రజల్లో శారీరక ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పించేందుకు ఈ మారథాన్ నిర్వహించినట్లు అకాడమీ ప్రతినిధులు వెల్లడించారు. - ఏయూ క్యాంపస్ 8లో

• దేశభక్తి ఉప్పొంగేలా..



బీచ్‌రోడ్డులోని విక్టర్ ఎట్ సీ వద్ద ఆదివారం రాత్రి ప్రదర్శించిన లేజర్ షో ఆద్యంతం ఆకట్టుకుంది. దేశ రక్షణ రంగ పటిమను ప్రస్ఫుటం చేసే విధంగా ఈ లేజర్ షోను ప్రతీ ఆదివారం జీవీఎంసీ, నేవీ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. - ఏయూ క్యాంపస్

న్యూస్‌రీల్

ఫుడ్ పాయిజన్‌తో ఏడుగురు విద్యార్థులకు అస్వస్థత

బీచ్‌రోడ్డు: సిరిపురంలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో మిగిలిపోయిన ఆహారం తిన్న ఏడుగురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వీరిని రామ్‌నగర్‌లోని ఓమ్ని ఆర్కే ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో ఓ విద్యార్థి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. నగరంలోని శ్రీవిశ్వ జూనియర్ కళాశాల హాస్టల్ సిబ్బంది ఫంక్షన్‌లో మిగిలిపోయిన ఆహారాన్ని రాత్రికి విద్యార్థులకు పెట్టడం వల్ల ఫుడ్ పాయిజన్ అయినట్లు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు.

కంబాలకొండలోకి కొండ చిలువలు



కొండచిలువలతో స్నేక్ క్యాచర్ కిరణ్

ఆరిలోవ: స్నేక్ క్యాచర్ రొక్కం కిరణ్ ఇటీవల పట్టుకున్న మూడు కొండచిలువలను ఆదివారం కంబాలకొండ అభయారణ్యంలో విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ 20 రోజుల కిందట ఎండాడ, ఆర్అండ్‌బీ, విమాన నగర్ ప్రాంతాల్లో మూడు కొండచిలువలు పట్టుకున్నట్లు చెప్పారు. వీటికి అనారోగ్యం చేయడంతో వెటర్నరీ వైద్యులను సంప్రదించి వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. కొండచిలువల ఆరోగ్యం కుదుటపడడంతో.. వెటర్నరీ వైద్యుల సమక్షంలో అరణ్యంలోకి విడిచిపెట్టినట్లు వెల్లడించారు. పాములు కనిపిస్తే చంపవద్దన్నారు.

జీవీఎంసీలో అంతర్గత బదిలీలు

మహారాణిపేట : జీవీఎంసీలో అంతర్గత బదిలీలు జరిగాయి. ఎస్ఈలు, ఈఈ, డీఈఈ, ఏఈఈలను బదిలీ చేస్తూ జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎలక్ట్రికల్, మెకానికల్, వాటర్ వర్క్స్ విభాగంలో బదిలీలు జరిగాయి. వాటర్ వర్క్స్ ఎస్ఈ కె.వి.ఎన్.రవిని అక్కడే కొన్ని విభాగాలకు బదిలీ చేశారు. మెకానికల్ విభాగం ఈఈ కె.దిలీప్‌ను జోన్–1కు బదిలీ చేశారు. ఈఈ పి.వి.గంగధర్‌ను స్మార్ట్ సిటీ నుంచి జోన్–3లో రోడ్డు సేఫ్టీకి బదిలీ చేశారు. ఈఈ నరసింగరావును స్మార్ట్ సిటీ ప్రాజెక్టు నుంచి స్మార్ట్‌సిటీ ఎఫ్ఏసీకి మార్చారు. ఈఈ కె.శాంతిరాజును జోన్–1 అండ్ 2 నుంచి జోన్–2కి పరిమితం చేశారు. ఈఈ ఎస్.చిరంజీవిని జోన్–7 నుంచి జోన్–8కు బదిలీ చేశారు. ఈఈ బి.విజయ దుర్గాను సీఈ పేషీ నుంచి సీఈ ఎస్టాబ్లిష్‌మెంట్‌కు మార్పు చేశారు. వీరు కాకుండా 12 మంది డీఈఈలు, 11 మంది ఏఈలకు బదిలీల జరిగాయి.

జూలో మౌస్‌డీర్ పిల్ల జననం

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్క్‌లో మౌస్‌డీర్ ఒక పిల్లకు జన్మనిచ్చింది. మౌస్‌డీర్ అరుదైన వన్యప్రాణి. వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం ఇది షెడ్యూల్ జాబితాలో ఉన్న జంతువు. జూలో రెండు ఆడవి, ఒక మగ మౌస్‌డీర్లు ఉన్నాయి. వాటిలో ఓ మౌస్‌డీర్‌కు ఆదివారం ఉదయం ఒక పిల్ల పుట్టినట్లు జూ అధికారులు తెలిపారు. ఆ పిల్ల మగదా, ఆడదా అనేది కొద్ది రోజుల తర్వాతే నిర్ధారణ చేయగలమన్నారు. ప్రస్తుతం నాలుగు మౌస్‌డీర్లు ఉన్నట్లు వివరించారు.

సింహాద్రి ప్రాజెక్టు హెడ్‌గా సమీర్ శర్మ

పరవాడ : సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్‌గా సమీర్ శర్మను నియమిస్తూ ఎన్టీపీసీ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన ఇంతవరకు మధ్యప్రదేశ్‌లో వింధ్యాచల్‌లోని ఎన్టీపీసీ ఓఅండ్ఎం జీఎంగా పనిచేశారు. ఇక్కడ జీజీఎంగా విధులు నిర్వహించిన సంజయ్ కుమార్ సిన్హాను తమిళనాడులోని వల్లూర్‌లోని ఎన్‌టీఈసీఎల్‌కు సీఈవోగా బదిలీ చేశారు.

నేవీ డే.. విశాఖలో లేనట్లే..



తొలిసారి పూరీలో నిర్వహించేందుకు ఏర్పాట్లు

రాష్ట్రపతి హాజరుకానున్న నేపథ్యంలో వేదిక మార్పు

సంద్రంలో యుద్ధశబ్దాలు.. తీరంలో శత్రుమూకలపై ఆకస్మిక దాడులు.. సముద్రంలో చిక్కుకున్న వారిని రక్షించడం .. ఎగురుతున్న హెలికాప్టర్ల నుంచి కిందకు దిగడం.. ప్యారాచూట్లతో నేవీ సిబ్బంది ప్రదర్శనలు.. భూమి, ఆకాశంతో పాటు సముద్ర జలాలపై విన్యాసాలు.. ఈ ఏడాది ఇవేవి కనిపించవు.. ఎందుకంటే ఈసారి నేవీ డేని పూరీలో నిర్వహించాలని భారత నౌకాదళం నిర్ణయించింది. ఆ రోజు కేవలం విద్యుత్ వెలుగుల్లో రెండు యుద్ధ నౌకల ప్రదర్శనకే విశాఖ తీరం పరిమితం కానుంది.

- 1971లో పాక్‌పై విజయం తర్వాత విశాఖలో నేవీడే నిర్వహణ
- 2012లో ప్రధాని గుజ్రాల్ మృతితో విన్యాసాలు రద్దు
- 2020లో కోవిడ్ కారణంగా రద్దు చేసిన నౌకాదళం
- ఈసారి ఏకంగా విశాఖకు దూరంగా నేవీ డే విన్యాసాలు

సాక్షి, విశాఖపట్నం : 1971లో పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో భారత నౌకాదళం ప్రదర్శించిన సాంకేతిక ప్రతిభా పాటవాలు, వ్యూహాలు, ధైర్యసాహసాలకు గుర్తుగా ప్రతి ఏటా డిసెంబర్ నాలుగో తేదీని నేవీ డేగా నిర్వహిస్తున్నారు. ఆ రోజున తూర్పు నౌకాదళం ఆధ్వర్యంలో సాగర తీరంలో ఆర్కే బీచ్ వద్ద భారత నౌకాదళ సామర్థ్యాలను ప్రదర్శించేవారు. ఇందుకోసం నవంబర్ నుంచే నౌకాదళ సిబ్బంది తీవ్ర కసరత్తులు చేసేవారు. యుద్ధనౌకలు, హైస్పీడ్ బోట్లు, జెమినీ బోట్లు యుద్ధ విమాన విన్యాసాలు, హెలికాప్టర్లు, స్కై డైవర్లు.. శత్రు స్థావరాలపై విరుచుకుపడే మెరైన్ కమాండోలు, యుద్ధ ట్యాంకులతో ఆర్కే బీచ్‌ని ఆక్రమణ... ఇలా.. ఒకటి కాదు రెండు కాదు.. కళ్లు చెదిరే విన్యాసాలతో కదన రంగాన్ని తలపించే ఆరోజు కోసం విశాఖ ప్రజలే కాదు దేశమంతా ఎదురు చూస్తుంటుంది. ఈ సారి మాత్రం భారత నేవీ శక్తి సామర్థ్యాలను ప్రత్యక్షంగా వీక్షించే అదృష్టం నగర వాసులకు లేదు. ఈసారి నేవీ డేని విశాఖలో కాకుండా పూరీలో నిర్వహించాలని భారత నౌకాదళం నిర్ణయించింది.

తొలిసారి పూరీ వేదికగా..

ఏటా నౌకాదళ దినోత్సవాలు విశాఖ వేదికగా జరుగుతాయి. ముఖ్య అతిథిగా కేంద్ర రక్షణ మంత్రితో పాటు భారత నౌకాదళాధిపతి, రాష్ట్ర మంత్రులు, నౌకాదళాధికారులు హాజరవుతుంటారు. పశ్చిమ నౌకాదళంలోనూ నేవీ డే నిర్వహించినా.. ప్రధాన వేడుకలు మాత్రం విశాఖలోనే జరుగుతాయి. తొలిసారిగా విశాఖ వేదికని రద్దు చేసి.. ఒడిశా రాష్ట్రంలోని పూరీలో వేడుకలు నిర్వహించాలని తూర్పు నౌకాదళం నిర్ణయించింది. ఒడిశా కూడా తూర్పు నౌకాదళం పరిధిలోనే ఉంది. నేవీ డే విన్యాసాల వేదికలను మార్పు చేయాలని గతేడాది నిర్ణయించినా దాన్ని పశ్చిమ నౌకాదళంలోనే అమలు చేశారు. ఈసారి ఈఎన్‌సీలో అమలుకు నిర్ణయించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సొంత రాష్ట్రం కావడంతో ఈ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. తూర్పు నౌకాదళానికి చెందిన యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు మొత్తం.. ఈ నెల మూడో వారంలో పూరీకి పయనం కానున్నాయి.

కోవిడ్ తర్వాత.. మరో'సారీ'

1971లో పాక్‌కి చెందిన ఘాజీ జలాంతర్గామిని విశాఖ తీరానికి సమీపంలో మట్టుబెట్టారు. ఈ కారణంగానే నేవీ డేని ఇక్కడ నిర్వహిస్తున్నారు. 2012లో మాజీ ప్రధాని ఐకే గుజ్రాల్ మరణించడంతో ఆయన సంతాప దినంలో భాగంగా నేవీడే ఉత్సవాల్ని పూర్తిగా నిర్వహించలేదు. కరోనా కారణంగా 2020లో వేడుకలు రద్దయ్యాయి. ఈసారి ఏకంగా వేదికనే మార్చేయడంతో విశాఖ వాసులు నిరాశ చెందుతున్నారు. అయితే డిసెంబర్ 4న ఏటా మాదిరిగా ఉదయం 7.30 గంటలకు నౌకాదళాధికారులు బీచ్‌రోడ్‌లోని విక్టరీ ఎట్ సీ స్మారక స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి అమరులకు శ్రద్ధాంజలి ఘటిస్తారు. అనంతరం గౌరవ వందనం నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటల తర్వాత ఆర్కే బీచ్‌కి సమీపంలో రెండు యుద్ధనౌకలతో ప్రదర్శన నిర్వహించాలని అధికారులు భావిస్తున్నారు. దీనిపై త్వరలోనే నిర్ణయం వెలువడనుందని తూర్పు నౌకాదళ వర్గాలు వెల్లడించాయి.

సంస్థ పురోభివృద్ధికి కృషి చేద్దాం..

ఎన్టీపీసీని సందర్శించిన సౌత్ ఆర్ఈడీ పాండు



సింహాద్రి ఎన్టీపీసీ అధికారులకు సూచనలిస్తున్న సౌత్ ఆర్ఈడీ కేఆర్ పాండు

పరవాడ: సంస్థ పురోభివృద్ధికి అంతా కలిసి పనిచేయాలని ఎన్టీపీసీ సౌత్ రీజినల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.ఆర్.పాండు పిలుపునిచ్చారు. సింహాద్రి ఎన్టీపీసీని ఆదివారం సందర్శించారు. ఆయనకు జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా పుష్పగుచ్ఛం అందించి, సాదరంగా ఆహ్వానించారు. అనంతరం సింహాద్రి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సంస్థ పురోభివృద్ధిపై ఉన్నతాధికారులు, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రతినిధులతో చర్చించారు. ఎన్టీపీసీలో జరుగుతున్న కార్యకలాపాలు, అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్శనలో భాగంగా సంస్థలో కంట్రోల్ రూమ్, సీహెచ్‌పీ డబ్ల్యూటీ ఏరియా, ఎఫ్‌జీడీ, జీవన్‌రేఖా ఆస్పత్రిలోని సృజనం చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను సందర్శించి, అక్కడి కార్యకలాపాలపై సంబంధిత అధికారులు, పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు.

అంగరంగ వైభవంగా స్వర్ణోత్సవం

దీపాంజలినగర్‌లోని సాధన క్రీడా మైదానంలో శనివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగిన ఎన్టీపీసీ స్వర్ణోత్సవంలో కె.ఆర్.పాండు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రాండ్ కల్చరల్ ఈవెంట్‌ను ఆసాంతం తిలకించారు. ఈవెంట్‌లో గాయకుడు శ్రీరామచంద్ర తన అద్భుత పాటల ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. రైజింగ్ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. భారతదేశ విద్యుత్ రంగంలో ఎన్టీపీసీ 50 ఏళ్ల ప్రయాణం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంస్థ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

150 అంశాలు.. 275 మంది ప్రసంగాలు

ముగిసిన ఇసికాన్ సదస్సు



ఎండోక్రినాలజిస్ట్ డాక్టర్ దిలీప్‌కుమార్‌ను సన్మానించి జ్ఞాపిక అందజేస్తున్న వైద్యులు

మహారాణిపేట: నగరంలోని ఓ హోటల్‌లో మూడు రోజులుగా జరుగుతున్న ఎండోక్రైన్ సొసైటీ ఆఫ్ ఇండియా (ఇసికాన్–2024) 53వ వార్షిక సదస్సు ఆదివారంతో ముగిసింది. జాతీయ సదస్సులో 150 అంశాలపై 275 మంది ఎండోక్రినాలజిస్టులు ప్రసంగించారు. మొత్తం మీద 2,600 మంది వైద్యులు 40 సెషన్లలో పాల్గొన్నారు. చివరి రోజు మధుమేహం, పొట్టితనం నియంత్రణలో పురోగతి, ముఖ్యంగా స్థూలకాయాన్ని అధిగమించే వ్యూహాల గురించి విస్తృత స్థాయిలో చర్చించారు. జీవన విధానంలో వివిధ రకాల మార్పుల వల్ల దీర్ఘకాలిక వ్యాధులైన థైరాయిడ్, చక్కెర వ్యాధులు సోకిన వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోందని, ఈ వ్యాధులను అదుపులో ఉంచుకోవడానికి వ్యాయామం చేయడం, ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్ తీసుకోకుండా ఉండాలని పలువురు ఎండోక్రినాలజిస్టులు సూచించారు. ఆహార అలవాట్లు, వ్యాయామం లేకపోవడం, నిద్రలేమి, స్టెరాయిడ్ విచ్చిన్నంగా వినియోగం వల్ల నపుంసకత్వం రావడం, అవాంఛిత రోమాలు ఎక్కడ పడితే అక్కడ రావడం, జన్యువుల్లో మార్పుల వల్ల పొట్టిగా ఉండడం వంటి సంఘటనలపై చర్చించామని ఎండోక్రైన్ సొసైటీ ఆఫ్ ఇండియా నిర్వాహక కార్యదర్శి డాక్టర్ కె.ఎ.వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. అమెరికా, దుబాయ్, ఖతర్, నేపాల్, ఇండోనేషియా, యు.కె.ల నుంచి పలువురు విదేశీ వైద్యులు, దేశంలో నిష్ణాతులైన వైద్యులు ఈ సదస్సులో పాల్గొన్నారు. వైద్యులు కె.దిలీప్ కుమార్, శ్రీధర్, మైథిలీ, వివేకానంద, వంశీకృష్ణ, రామ్మోహన్, శ్రీనివాసులు, జయంతి రమేష్, పద్మలత తదితరులు సదస్సు విజయవంతంలో సహకరించారు.

ఉక్కుపై బాబు, పవన్ సమాధానం చెప్పాలి



కుటుంబ సభ్యులతో సహా ధర్నాలో పాల్గొన్న స్టీల్‌ప్లాంట్ కార్మికులు (ఇన్‌సెట్) ప్లకార్డు ప్రదర్శిస్తున్న సీఐటీయూ ఆలిండియా ఉపాధ్యక్షురాలు పుణ్యవతి

- ఇంత జరుగుతున్నా వారు ఎక్కడున్నారు?
- సీఐటీయూ ఆలిండియా ఉపాధ్యక్షురాలు పుణ్యవతి ఎద్దేవా
- ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా స్టీల్‌ప్లాంట్ కార్మికుల ధర్నా

గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో ఎన్డీఏ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న చంద్రబాబు, పవన్ కల్యాణ్ సమాధానం చెప్పాలని సీఐటీయూ ఆలిండియా ఉపాధ్యక్షురాలు ఎస్.పుణ్యవతి డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ ఆ పరిశ్రమ కార్మికులు గాజువాకలో ఆదివారం ధర్నా నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్మికులు తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులను కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. సేవ్ పబ్లిక్ సెక్టార్.. సేవ్ ఇండియా అంటూ నినదించారు. వీఆర్ఎస్ పేరుతో కార్మికుల తొలగింపు ఆపాలని, పెండింగ్‌లో ఉన్న కార్మికుల జీతాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పుణ్యవతి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి పార్టీలకు రాజకీయాలు తప్ప ప్రజా సమస్యలు పట్టడంలేదన్నారు. ఈ ధర్నాలో వాస్తవానికి చంద్రబాబు కూర్చోవాలన్నారు. ఇంత జరుగుతున్నా చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఎక్కడున్నారని ప్రశ్నించారు. ప్రైవేటీకరణ నుంచి స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడం కోసం కార్మికులు తమ కుటుంబాలతో నాలుగేళ్లుగా ఆందోళన చేస్తున్నా ఏ మాత్రం కేంద్ర ప్రభుత్వానికి పట్టడంలేదన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను అదానీకో, మిట్టల్‌కో, మరెవరికో కట్టబెడతామంటున్నారని, ప్రైవేట్‌వాడు వచ్చి ఏం ఉద్ధరిస్తాడని ప్రశ్నించారు. ఢిల్లీ తరహాలోనే విశాఖలో కూడా కాలుష్యం దారుణంగా పెరుగుతోందన్నారు. ఇక్కడ భూములు ఎక్కువగా ఉండటం వల్ల కాలుష్యాన్ని నియంత్రించగలుగుతున్నారన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కళ్లు తెరవాలన్నారు. స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ నాయకులు జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, వై.టి.దాస్, ఎస్.రామారావు, జి.శ్రీనివాసరావు, శ్రీనివాసరాజు, నమ్మి రమణ, కుమారమంగళం, ఆర్‌కేఎస్‌వీ కుమార్, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

బదిలీల్లో అవినీతి.. విచారణకు మోకాలడ్డు

- ఉమ్మడి విశాఖ జిల్లాలో ఈవోపీఆర్డీల బదిలీల్లో అక్రమాలు
- 'సాక్షి' వరుస కథనాలతో విచారణకు ఆదేశించిన ప్రభుత్వం
- రెండు సార్లు నోటీసులిచ్చినా హాజరుకాని అనకాపల్లి డీపీవో
- తాజాగా విచారణాధికారి పరిధి కుదింపు

మహారాణిపేట: పంచాయతీరాజ్ శాఖలో అడ్డగోలు బదిలీల వ్యవహారంలో సరికొత్త ట్విస్ట్ చోటు చేసుకుంది. అక్రమ బదిలీల ఆరోపణలు ఉన్న జిల్లాలను విచారణకు మినహాయింపు ఇవ్వడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. కూటమి ప్రజాప్రతినిధుల ఒత్తిళ్ల కారణంగా అడ్డగోలు బదిలీల వ్యవహారం వెలుగులోకి రాకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. పంచాయతీ కార్యనిర్వహణాధికారి అండ్ రూరల్ డెవలప్‌మెంట్(ఈవోపీఆర్డీ) బదిలీలపై విచారణ చేస్తున్న జెడ్పీ సీఈవో పరిధి కుదించడమే ఇందుకు నిదర్శనం.

ఉమ్మడి విశాఖ జిల్లాలో సెప్టెంబర్ 22న ఈవోపీఆర్డీల బదిలీ ప్రక్రియను చేపట్టారు. ఇందులో కూటమి ప్రజాప్రతినిధుల సిఫార్సులకు పెద్ద పీట వేశారు. అలాగే కొంత మంది ఉన్నతాధికారులు భారీ ముడుపులు తీసుకుని కొందరికి స్థానచలనం కలిగించారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. కొంత మంది ఏకంగా ఆన్‌లైన్ ద్వారానే చెల్లింపులు చేసినట్లు సమాచారం. దీనిపై ఉద్యోగులు కలెక్టర్‌కు ఫిర్యాదులు చేశారు. ఏళ్ల తరబడి గిరిజన ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న వారు ఈ బదిలీలతో మైదాన ప్రాంతాల్లోకి రావచ్చని ఆశపడ్డారు. అయితే సిఫార్సులు, ముడుపులు కారణంగా వారు గిరిజన ప్రాంతాలకే పరిమితమయ్యారు. బదిలీ ప్రక్రియలో భారీగా డబ్బు చేతులు మారడం కారణంగానే తమకు అన్యాయం జరిగిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.



విచారణకు సహకరించని అధికారులు

కలెక్టర్ ఆదేశాల మేరకు జెడ్పీ సీఈవో విచారణ ప్రారంభించారు. అయితే అనకాపల్లి, అల్లూరి జిల్లాల పంచాయతీ అధికారుల నుంచి ఎటువంటి సహకారం అందలేదని తెలిసింది. బదిలీ విషయంలో విచారణకు హాజరుకావాలని ఆ జిల్లాల పంచాయతీ అధికారులకు సీఈవో నోటీసులు జారీ చేశారు. అయితే వారు హాజరు కాకుండా డుమ్మా కొట్టారు. బదిలీల కోసం వచ్చిన దరఖాస్తులు, తీసుకున్న నిర్ణయాల నివేదికలు కావాలని అడిగినా వారు స్పందించలేదు. దీంతో సీఈవో స్వయంగా ఆయా జిల్లాలకు వెళ్లి సమాచారం సేకరించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇలా వివరాల కోసం ప్రయత్నిస్తున్న సమయంలో అక్కడి అధికారులు తమ జిల్లాలో తలదూర్చవద్దని.. విశాఖ జిల్లాలో మాత్రమే విచారణ చేసుకోవాలని చెప్పడంతో సీఈవో నిర్ఘాంతపోయినట్లు తెలిసింది.

'సాక్షి' కథనాలతో ప్రభుత్వంలో కదలిక

సెప్టెంబర్ 22వ తేదీనే బదిలీల ప్రక్రియను చేపట్టినప్పటికీ.. ఆ జాబితాను ఆ నెల 30వ తేదీ వరకు రహస్యంగా ఉంచడంపై అనేక ఆరోపణలు వినిపించాయి. కేవలం ఈవోపీఆర్డీలకు మెయిల్ పెట్టి చేతులు దులిపేసుకున్నారు. ఈ వ్యవహారం మీద పలువురు ఈవోపీఆర్డీలు విశాఖ కలెక్టర్ ఎం.ఎన్.హరేందిరప్రసాద్‌ను కలిసి ఫిర్యాదులు చేశారు. దీనిపై సాక్షి వరస కథనాలు ప్రచురించడంతో ప్రభుత్వం ఈ వ్యవహారంపై దృష్టి సారించింది. ఈ బదిలీలపై విచారణ జరిపించాలని కలెక్టర్‌ను ఆదేశించింది. విచారణాధికారిగా జిల్లా పరిషత్ సీఈవో పి.నారాయణమూర్తిని కలెక్టర్ నియమించారు.

మినహాయింపుపై అనుమానాలు

కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేస్తున్న సీఈవోపై కూటమి ప్రజాప్రతినిధులు ఒత్తిళ్లు తీసుకొచ్చినట్లు సమాచారం. అంతటితో ఆగకుండా అనకాపల్లి, అల్లూరి జిల్లాలను విచారణ నుంచి మినహాయించేలా ప్రభుత్వంతోనే చెప్పించడం గమనార్హం. దీంతో అక్రమ బదిలీల వ్యవహారంలో అనకాపల్లి, అల్లూరి జిల్లాలను మినహాయిస్తూ ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. విచారణాధికారి పరిధిని కేవలం విశాఖకు మాత్రమే పరిమతం చేశారు.

8 నుంచి దివ్యాంగుల క్రికెట్ టోర్నీ

డాబాగార్డెన్స్: హిందూస్థాన్ జింక్ క్రికెట్ మైదానం వేదికగా రాష్ట్ర దివ్యాంగుల క్రికెట్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వచ్చే నెల 8 నుంచి 11వ తేదీ వరకు క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నారు. అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఈ టోర్నమెంట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని 10 జిల్లాల నుంచి 10 టీమ్‌లు ఈ టోర్నీలో పాల్గొంటున్నాయని వెల్లడించారు. టోర్నమెంట్ నిర్వాహకులు మణికంత, హేమ సుందర్, బలరామకృష్ణ, షేక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్ ఏడీగా అప్పారావు

మహారాణిపేట: కేజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్(పరిపాలన)గా పి.ఎస్.అప్పారావు నియమితులయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం విజయనగరం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఏడీగా పనిచేస్తున్న ఆయన సోమవారం ఇక్కడ పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. గతంలో ఆంధ్రా మెడికల్ కాలేజీ, కేజీహెచ్‌లో పనిచేశారు.

సంద్రం.. రంగుల ప్రపంచం





ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

సముద్రం అనేక అద్భుతాల నిలయం. ప్రతి రోజూ.. ప్రతి క్షణం తన అందాలతో మనల్ని ఆశ్చర్యపరుస్తూనే ఉంటుంది. ఉదయం భానుడి లేలేత కిరణాలు కెరటాలపై పడగానే సముద్రం సువర్ణ శోభితంగా మారుతుంది. మధ్యాహ్న వేళ వెండి వర్ణంలో కనువిందు చేస్తుంది. సాయంత్రం సూర్యాస్తమయం వేళ ఎరుపు, నారింజ లేదా గులాబీ రంగుల్లో మెరుస్తూ రొమాంటిక్‌గా కనిపిస్తుంది. ఇలా మనకు సముద్రం ఆనందాన్ని, ప్రశాంతతనిస్తుంది. ఉదయం, మధ్యాహ్న వేళ సముద్ర అందాలను 'సాక్షి' తన కెమెరాలో బంధించింది. - ఏయూ క్యాంపస్



ప్రార్థనలు చేస్తున్న సిక్కులు



రోడ్డును శుభ్రం చేస్తున్న సిక్కులు



నగర్ కీర్తన్‌లో పాల్గొన్న సిక్కులు

ఘనంగా గురునానక్ జయంతి

సీతమ్మధార: సిక్కుల మొదటి గురువు గురునానక్ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. గురుద్వారా సత్సంగ్ మందిరంలో అధ్యక్షుడు డి.ఎస్.ఆనంద్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం నగర్ కీర్తన్ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. మధ్యాహ్నం 2 గంటలకు ఉత్తర ఎమ్మెల్యే కుమార్తె శ్యామల దీపిక జెండా ఊపి నగర్ కీర్తన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ర్యాలీ సీతంపేట, ఆర్టీసీ కాంప్లెక్స్, పాత జైలురోడ్డు, సెవెన్ హిల్స్ ఆస్పత్రి, సిరిపురం, ఆర్.కె.బీచ్, పామ్ బీచ్, కాళీమాత గుడి నుంచి రామాటాకీస్, సత్యం జంక్షన్ మీదుగా తిరిగి రాత్రి 7 గంటలకు గురుద్వారా వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా సిక్కు జెండాలతో అలంకరించిన నిషాన్ సాహిబ్ వాహనం ర్యాలీలో పాల్గొంది. పెద్ద సంఖ్యలో సిక్కులు హాజరై సందడి చేశారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ వైద్యులు, సిబ్బంది

'కంటిపాప'లను కాపాడుకుందాం

ఏయూక్యాంపస్: చిన్న వయసులోనే కంటి సమస్యలను గుర్తించి.. చికిత్స అందించాల్సిన అవసరం ఉందని ఎల్.వి.ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ చిన్నారుల కంటి వైద్య నిపుణుడు డాక్టర్ అభీష్ట శర్మ పిలుపునిచ్చారు. ఎల్.వి.ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ, జీఎంఆర్ వరలక్ష్మి సంస్థ ఆధ్వర్యంలో బాలల నేత్ర సంరక్షణ వారోత్సవాలు పురస్కరించుకుని ఆదివారం ఉదయం అవగాహన నడక నిర్వహించారు. బీచ్‌రోడ్డు కాళీమాత ఆలయం నుంచి విక్టరీ ఎట్ సీ వరకు ప్లకార్డులు పట్టుకుని, నినాదాలతో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా అభీష్ట శర్మ మాట్లాడుతూ పిల్లల్లో వచ్చే కంటి వ్యాధులపై సామాజిక అవగాహన కలిగించడానికి కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఏటా నవంబర్ 7 నుంచి 14వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా తమ శాఖల్లో చిన్నారులకు చిత్రలేఖనం, ఫ్యాన్సీ డ్రెస్, వక్తృత్వం, క్లే మోడలింగ్, బ్రెయిలీ చదవడం తదితర అంశాల్లో పోటీలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. బాలల్లో వచ్చే కంటి శుక్లాలు అనే అంశంపై ఈ ఏడాది కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. బాల్య శుక్లాల ఫలితంగా పిల్లల కంటి చూపుపై ప్రభావం పడుతుందని.. దీనిని త్వరితగతిన గుర్తించి చికిత్స అందించాలని సూచించారు. సంస్థ సిబ్బంది, చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సాగర తీరంలో ఆరోగ్య పరుగు



బీచ్‌రోడ్డులో మారథాన్ ప్రారంభిస్తున్న నిర్వాహకులు



కార్యక్రమంలో పాల్గొన్న నగరవాసులు

ఏయూక్యాంపస్: క్రీడలకు వేదికగా విశాఖ నిలవాలని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అన్నారు. బీచ్‌రోడ్డులో ఆదివారం నమహ అకాడమీ, ఇండియన్ నేవీ సంయుక్తంగా నిర్వహించిన మారథాన్ విజేతలకు ఎమ్మెల్యే బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ మారథాన్‌కు విశాఖ తీరం శాశ్వత కేంద్రంగా మారాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖలో ఉద్యోగం కోసం వచ్చిన వారు నగరంతో ప్రేమలో పడిపోతారని.. ఇక్కడే ఇళ్లు కొనుక్కుని స్థిరనివాసం ఏర్పరచుకున్న వారు ఎంతో మంది ఉన్నారన్నారు. ఇండియన్ నేవీ కెప్టెన్ కుమార్ మాట్లాడుతూ మన నిత్య జీవితంలో శారీరక వ్యాయామానికి ప్రాధాన్యమివ్వాలన్నారు. నమహ అకాడమీ చీఫ్ స్వాతి మాట్లాడుతూ మహిళలు, పిల్లల ఆత్మరక్షణకు యుద్ధకళల్లో ప్రవేశం ఎంతో అవసరమన్నారు. అకాడమీ సహ నిర్వాహకుడు నగేష్ మాట్లాడుతూ విశాఖ ప్రజల్లో శారీరక ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై అవగాహన పెంచడమే తమ ఉద్దేశమన్నారు. ఆరోగ్యం, ఐక్యత పంచే వేదికగా ఈ మారథాన్ నిలవడం సంతోషాన్నిచ్చిందన్నారు.



యుద్ధ కళను ప్రదర్శిస్తున్న యువత

పర్యాటక ప్రాంతాల్లో 'కార్తీక' సందడి



ఏనుగుల ఎన్‌క్లోజర్ వద్ద సందర్శకులు



తెన్నేటి పార్క్ వద్ద సరదాగా..



ఆర్.కె బీచ్‌లో చిన్నారుల సందడి

ఆరిలోవ/ఏయూక్యాంపస్: జూ పార్కు ఆదివారం సందర్శకులతో కళకళలాడింది. కార్తీక మాసం రెండో ఆదివారం జూ పార్కును 6,509 మంది సందర్శించారు. పిల్లలు, పెద్దలు ఇక్కడ ఏనుగులు, ఖడ్గమృగం, కోతులు, జిరాఫీలు, చింపాంజీ, పులులు, పాములు తదితర ఎన్‌క్లోజర్ల వద్ద సందడి చేశారు. మోటోలో ఏనుగులు లక్ష్మి, సరస్వతి తిరుగుతూ సందర్శకులను అలరించాయి. వీటి వద్ద సందర్శకులు సెల్ఫీలు తీసుకుని సరదాగా గడిపారు. సందర్శకుల ద్వారా ఆదివారం ఒక్కరోజు రూ.5.10 లక్షల ఆదాయం లభించినట్లు ఇన్‌చార్జి క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. అలాగే తెన్నేటిపార్క్ నగరవాసులతో కిక్కిరిసింది. ఆర్.కె బీచ్ జన సాగరంగా మారింది. పిల్లలు ఆట వస్తువులతో సందడిగా గడిపారు. సకుటుంబ సపరి వార సమేతంగా ఆహ్లాద వాతావరణంలో గడిపారు.

'మట్కా' అందరినీ అలరిస్తుంది



ఏయూక్యాంపస్: ప్రాణం పెట్టి రూపొందించిన మట్కా సినిమా అందరినీ అలరిస్తుందని ఆ చిత్ర హీరో వరుణ్ తేజ్ అన్నారు. బీచ్‌రోడ్డులో ఆదివారం రాత్రి నిర్వహించిన చిత్ర ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో ఆయన మాట్లాడారు. ఈ నెల 14న చిత్రం విడుదల కానుందని, అందరినీ అలరిస్తుందన్నారు. 1982కి ముందు జరిగిన కథతో చిత్రం ఉంటుందన్నారు. ఈ చిత్రానికి కరుణకుమార్ దర్శకత్వం వహించగా..నిర్మాతగా విజయేందర్‌రెడ్డి వ్యవహరించారు. నటులు నవీన్‌చంద్ర, సత్యం రాజేష్, నట శిక్షకుడు సత్యానంద్, వరుణ్ సతీమణి లావణ్య త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో నగరవాసులు, అభిమానులు ఈవెంట్‌కు హాజరై.. సందడి చేశారు.

'సింహాచలం' అభివృద్ధిలో దాతల పాత్ర గొప్పది

అనువంశిక ధర్మకర్త అశోక్‌గజపతిరాజు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న అశోక్‌గజపతిరాజు

సింహాచలం: దేవస్థానాల్లో వినియోగించే నెయ్యి నాణ్యతను తనిఖీ చేసేందుకు అహ్మదాబాద్‌లోని లేబొరేటరీ తరహాలో రాష్ట్రంలో కూడా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని సింహాచలం దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు అన్నారు. సింహగిరి వైకుంఠవాసుడి మెట్టపై జీఆర్టీ జ్యూయలర్స్ రూ.1.50 కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసిన శంఖుచక్రనామాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ లేబొరేటరీ ఏర్పాటు వల్ల రాష్ట్రంలోని 9 ప్రధాన ఆలయాలతో పాటు 26 జిల్లాల్లోని చిన్న ఆలయాలకు ఇది ఎంతగానో ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. కామన్ గుడ్ ఫండ్ ద్వారా భవనాలు, పరికరాలను ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. సింహాచలం దేవస్థానం అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం గొప్పదన్నారు. దేవస్థానంలో జరుగుతున్న ప్రసాద్ స్కీమ్ పనుల్లో జాప్యం జరుగుతోందని, మాస్టర్ ప్లాన్‌కు అనుసంధానంగా పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సింహగిరిపై శంఖునామచక్రాలను ఏర్పాటు చేసిన జీఆర్టీ జ్యూయలర్స్ యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం జీఆర్టీ ప్రతినిధులు గోపికృష్ణ, సూర్యఅప్పారావులను ఘనంగా సత్కరించారు. పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, దేవదాయ శాఖ ఏడీసీ కె.రామచంద్రమోహన్, ఈవో వి.త్రినాథరావు, స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు పాల్గొన్నారు.

ఉక్కు స్కేటింగ్ క్రీడాకారులకు పతకాల పంట



పతకాలు సాధించిన ఉక్కు స్కేటింగ్ క్రీడాకారులు

ఉక్కునగరం: రాష్ట్ర స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో స్టీల్‌ప్లాంట్ రోలర్ స్కేటింగ్ క్రీడాకారులకు అనేక పతకాలు లభించాయి. ఈనెల 6 నుంచి 10 వరకు మంగళగిరిలో 36వ రాష్ట్ర స్థాయి రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఉక్కునగరం రోలర్ స్కేటింగ్ అసోసియేషన్‌కు చెందిన క్రీడాకారులు పలువురు పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఐదు జట్లకు బంగారు పతకాలు లభించగా, మరో ఐదు జట్లకు రజత పతకాలు లభించాయి. కెడెట్ బాయ్స్, కెడెట్ మిక్స్‌డ్, సబ్ జూనియర్ బాయ్స్, జూనియర్ గర్ల్స్, జూనియర్ మిక్స్‌డ్ కేటగిరీల్లో బంగారు పతకాలు లభించగా, కెడెట్ గర్ల్స్, సబ్ జూనియర్ గర్ల్స్, సబ్ జూనియర్ మిక్స్‌డ్, జూనియర్ బాయ్స్, సీనియర్ మెన్ కేటగిరీల్లో రజత పతకాలు గెలుపొందారు. ఈ సందర్భంగా క్రీడాకారులను కోచ్‌లు అమిత్ ఘడాయ్, కాశీ, గోపీ, స్పోర్ట్స్ విభాగం అధికారులు, వారి తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

ఒకే ఆసనం.. 1.08 గంటలు!

ఆరుగురికి యోగాసన బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు



ఆసనాలు వేస్తున్న యోగా సాధకులు

ఏయూక్యాంపస్: నగరానికి చెందిన యోగా సాధకులు యోగాసన బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించారు. బెంగళూరుకు చెందిన గ్లోబల్ వరల్డ్ రికార్డ్ ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులోని నేచర్ క్యూర్ ఆస్పత్రి ఆవరణలో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. ఎస్.శ్రీలక్ష్మి పద్మాసన భంగిమలో, ఎం.దుర్గా మాధవి సుప్త విరాసనం భంగిమలో, వరలక్ష్మి గర్భాసనం భంగిమలో, కృష్ణకుమారి భుజంగాసన భంగిమలో, మాధవి, రమణమూర్తి పద్మాసనం భంగిమలో 1.08 గంటల పాటు ఉండి కొత్త రికార్డులు సృష్టించారు. గ్లోబల్ వరల్డ్ రికార్డ్ ప్రతినిధులు వర్చువల్‌గా, యోగా శిక్షకుడు రమేష్ నేరుగా ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఆంధ్రప్రదేశ్ యోగా పరిషత్ ఉపాధ్యక్షుడు కె.ఎ.రాజు, కార్పొరేటర్ వురుకూటి అప్పారావు యోగా సాధకులను అభినందించి, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. డాక్టర్ ఎస్.లక్ష్మీనారాయణ, హనుమంతరావు తదితరులు ప్రసంగించారు. రూపాకుల రవికుమార్, ఎస్.మహేష్, ఎస్.ఛాతుర్య, ఎ.మల్లికార్జున, పల్లా చలపతిరావు, క్షీరాబ్ధిదుతి, దేవర చంద్రశేఖర్, తలాడ గిరిజ, డి.వి.ఆర్.ప్రసాద్ పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థిని అనుమానాస్పద మృతి

- గుట్టుచప్పుడు కాకుండా దహన సంస్కారాలు
- స్థానికుల ఫిర్యాదుతో ఆలస్యంగా వెలుగులోకి..
- దర్యాప్తు చేపట్టిన పోలీసులు

విశాఖ విద్య: గోపాలపట్నం మండలం కొత్తపాలెం నాగేంద్రకాలనీలో నర్సింగ్ విద్యార్థిని బలవన్మరణంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 7న జరిగిన ఈ సంఘటన.. స్థానికుల ఫిర్యాదుతో ఆదివారం వెలుగులోకి వచ్చింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు వాస్తవాలు నిగ్గుతేల్చేందుకు రంగంలోకి దిగారు. ఇందుకు సంబంధించిన స్థానికులు తెలిపిన వివరాలివీ.. పాలకొండకు చెందిన భాగ్యలక్ష్మి నాలుగేళ్ల కిందట విశాఖలో ఉంటున్న తన సోదరుడు ఏసుబాబు, వదినల వద్దకు చదువు నిమిత్తం వచ్చింది. ఏసుబాబు ఆటోడ్రైవర్‌గా, అతని భార్య స్థానిక పెట్రోల్ బంకులో పని చేస్తున్నారు. ఈ నెల 7వ తేదీ రాత్రి భాగ్యలక్ష్మి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆ రోజు రాత్రి ఏసుబాబు పనిమీద ఒడిశా వెళ్లగా.. ఆమె వదిన నైట్ డ్యూటీకి వెళ్లింది. 8వ తేదీ ఉదయం ఇంటికి వచ్చిన ఆమె.. జరిగిన విషయాన్ని భర్త ఏసుబాబుకు తెలిపింది. భాగ్యలక్ష్మి ఆత్మహత్య విషయాన్ని బయటకు పొక్కనీయకుండా కొత్తపాలెం శ్మశాన వాటికలో హడావుడిగా అంత్యక్రియలు నిర్వహించేశారు. దీనిపై అనుమానం వచ్చిన స్థానికులు గోపాలపట్నం పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఏసీపీ నరసింహమూర్తి, సీఐ కె.సురేష్ సిబ్బందితో ఆదివారం కొత్తపాలెం నాగేంద్రకాలనీకి వెళ్లి దర్యాప్తు ప్రారంభించారు. చుట్టుపక్కల వారితో మాట్లాడారు. అయితే భాగ్యలక్ష్మి మృతిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆమె ఆత్మహత్య చేసుకుందా? లేదా ఎవరైనా హత్య చేశారా? అనేది సర్వత్రా చర్చనీయాంశమైంది. భాగ్యలక్ష్మి మృతి చెందిన రాత్రి ఇంటి వద్ద ఏం జరిగిందనేది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. భాగ్యలక్ష్మి కొందరితో సన్నిహితంగా ఉండేదని.. ఇదే కారణంతో కొంత మంది యువకులు తరచూ వేధింపులకు గురి చేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. దీనిని అనుమానాస్పద మృతి కేసుగా పోలీసులు నమోదు చేసి.. భాగ్యలక్ష్మి వినియోగిస్తున్న సెల్‌ఫోన్ కాల్‌లిస్ట్ ఆధారంగా లోతైన దర్యాప్తు చేపడుతున్నారు. ఏసుబాబు, అతని భార్యను అదుపులోకి తీసుకుని వివరాలు రాబడుతున్నారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో విశాఖ విజయకేతనం

- బాలికల విభాగంలో కడప విజయం
- ముగిసిన రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు



బాలుర విభాగం విజేత విశాఖపట్నం జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అతిథులు

నక్కపల్లి: అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో మూడు రోజుల పాటు జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ 14 బాలబాలికల హాకీ పోటీలు ఆదివారం ముగిశాయి. ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలో 13 ఉమ్మడి జిల్లాల నుంచి 500 మందికి పైగా హాకీ క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలు హోరా హోరీగా జరిగాయి. ఆదివారం పెదబోదిగల్లం రోడ్డులో ఉన్న హెటిరో హాకీ మైదానంలో జరిగిన బాలికల ఫైనల్స్‌లో వైఎస్సార్ కడప జట్టు 2-1 స్కోర్‌తో విశాఖపట్నం జట్టుపై విజయం సాధించింది. బాలుర విభాగంలో జరిగిన మ్యాచ్‌లో విశాఖపట్నం జట్టు 1-0 స్కోర్‌తో కడప జట్టుపై విజయం సాధించింది. విజేతలకు రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, మండల టీడీపీ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్‌ల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ప్రతిభ కనబరిచిన బాల బాలికలను డిసెంబరు 8 నుంచి 13వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని మాండిసోరిలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగేశ్వరరావు తెలిపారు.

విమ్స్ ఉద్యోగి బ్రెయిన్ డెడ్

బీఆర్‌టీఎస్‌లో రోడ్డు ప్రమాదం ● స్పీడ్ బ్రేకర్ కారణంగానే ఘటన



మోహన్‌కుమార్(ఫైల్)

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రోడ్డులో శనివారం రాత్రి జరిగిన ప్రమాదంలో యువకుడు బ్రెయిన్‌డెడ్ అయి చనిపోయాడు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలివీ.. నరవకు చెందిన పేడాడ మోహన్‌కుమార్(26) విమ్స్‌లో ఎంఎన్‌ఓగా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై బీఆర్‌టీఎస్‌లో ఇంటికి వెళ్తున్నాడు. దారంపాలెం వద్ద పరంపర హోటల్ ముందు ఉన్న స్పీడ్ బ్రేకర్‌ను చీకటిలో గమనించలేకపోయాడు. ఆ స్పీడ్ బ్రేకర్ వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో మోహన్‌కుమార్ తలకు తీవ్రగాయమైంది. స్థానికులు వెంటనే అతన్ని విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న మోహన్‌కుమార్ బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సాధారణంగా బీఆర్‌టీఎస్ రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు ఉండవు. అత్యవసరమైన చోట్ల మాత్రమే ట్రాఫిక్ పోలీసుల సూచనలతో ఇంజినీరింగ్ అధికారులు స్పీడ్ బ్రేకర్లు వేస్తారు. ఇటీవల ఇక్కడ స్పీడ్‌బ్రేకర్‌ను అనధికారికంగా వేసినట్లు సమాచారం. ఈ ప్రాంతంలో విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో.. చీకటిలో స్పీడ్ బ్రేకర్ సరిగా కనిపించడం లేదు. దీంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. వారం రోజుల్లో సుమారు 20 మంది ఇక్కడ ప్రమాదాలకు గురై గాయాలపాలయినట్లు స్థానికులు తెలిపారు.

రైలులో గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఏపీ ఎక్స్‌ప్రెస్‌లో మరణించిన గుర్తు తెలియని వ్యక్తి

తాటిచెట్లపాలెం: న్యూఢిల్లీ నుంచి ఆదివారం ఉదయం విశాఖపట్నం చేరుకున్న ఏపీ ఎక్స్‌ప్రెస్‌లో గుర్తు తెలియని వ్యక్తి మరణించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మరణించిన వ్యక్తి వయసు సుమారు 35 సంవత్సరాలు ఉంటుందని, మృతునికి సంబంధించిన వివరాలు ఏమీ లేవని పేర్కొన్నారు. ఇతని గురించి తెలిసిన వారు విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గల గవర్నమెంట్ రైల్వే పోలీసులకు స్వయంగా గానీ లేదా దర్యాప్తు అధికారి, జీఆర్‌పీ ఎస్‌ఐ రామారావుకు గానీ లేదా 86398 65434 నంబర్లలో గానీ తెలియజేయాలని కోరారు.

క్షణకాలంలో కబళించిన మృత్యువు

నాలుగో అంతస్తు పైనుంచి పడి యువతి మృతి



గాయత్రి(ఫైల్)

పీఎంపాలెం: అప్పటి వరకు ఎంతో చలాకీగా ఉన్న ఆమెను క్షణకాలంలో మృత్యువు కబళించింది. ప్రమాదవశాత్తూ అపార్టుమెంట్ నాలుగో అంతస్తు నుంచి కిందకు పడి మృతి చెందింది. మధురవాడ శివశక్తినగర్‌లోని ఎస్‌వీఎస్ ఫైనేయర్ కాస్టల్ అపార్ట్‌మెంట్‌లో ఆదివారం ఉదయం 9 గంటల సమయంలో విషాదం చోటుచేసుకుంది. పీఎంపాలెం ఎస్‌ఐ సునీత తెలిపిన వివరాలివీ.. శివశక్తినగర్‌లోని ఈ అపార్ట్‌మెంట్‌లో జరజాన భద్రాచలం, అతని భార్య ఉషారాణి, కుమారుడు వరాహ రామాచలం, కుమార్తె గాయత్రి(23) నివసిస్తున్నారు. భద్రాచలం యూఎస్‌లో సీమెన్‌గా పనిచేస్తున్నారు. నెల రోజుల కిందట విధుల నిమిత్తం ఆయన యూఎస్ వెళ్లారు. గాయత్రి నగరంలోని ఓ కాలేజీలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతోంది. ఆదివారం ఉదయం తమ ఫ్లాట్ బాల్కని కింది భాగంను శుభ్రపరచే పనులు చేపట్టింది. బాల్కనికి కొంచెం దిగువన ఉన్న తులసి మొక్కను నీరు పోయడానికి గాయత్రి కిందకు వంగింది. ఈ క్రమంలో అదుపుతప్పి కిందకు పడిపోయింది. తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. కుమార్తె మరణించడంతో ఆమె తల్లి రోదించిన తీరు అందరినీ కలచివేసింది. అపార్ట్‌మెంట్ వాసులు విషాదంలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న పీఎంపాలెం ఎస్‌ఐ సునీత సిబ్బందితో అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. గాయత్రి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఉషారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.